క్లుప్తంగా

4న జిల్లా యువజన పండుగలు

పరకాల: ఈ నెల 4న హనుమకొండలోని జవహార్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు క్రీడలపై జిల్లా యువజన పండుగలను నిర్వహిస్తున్నారని పరకాల తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోక్ డ్యాన్స్, ఫోక్ సింగింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు వారు అర్హులవుతారన్నారని వెల్లడించారు.

నియామకం

పరకాల: టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పరకాల మండల అధ్యక్షుడుగా కట్కూరి దేవేందర్‌రెడ్డి, నడికూడ మండల అధ్యక్షుడుగా బుర్ర దేవేందర్‌లను నియామించినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి తెలిపారు. శనివారం జరిగిన రెండు మండలాల కార్యకర్తల సమావేశంలో ఆయన నియామకాన్ని ప్రకటించారు. వారిద్దరి నియమకాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

శివసాయి పరపతి సంఘం అధ్యక్షుడిగా సుమన్

శాయంపేట: శాయంపేట శివసాయి పరపతి సంఘం అధ్యక్షుడిగా మార్త సుమన్ ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్, స్థానిక సర్పంచ్ కందగట్ల రవి తెలిపారు. గ్రామంలోని మార్కండేయ ట్రస్ట్ భవనంలో సోమవారం ఎన్నికలను నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా కందగట్ల సంతోష్, ప్రధాన కార్యదర్శిగా సామల రఘు, కార్యవర్గ సభ్యులు చిందం గణేష్, ప్రభాకర్, బాలనే తిలక్‌బాబు, బాసని జనార్దన్, సలహా కమిటీ సభ్యులుగా మంత్రి వెంకటేశ్వర్లు, బాసాని సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, దిడ్డి ప్రభాకర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నివాళి

ఎల్కతుర్తి: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని సూరారంలో సీపీఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు మాట్లాడుతూ ఏబీ బర్ధన్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

భీమదేవరపల్లి: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ సేవలు మరవలేనివని సీపీఐ మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ముల్కనూర్‌లో బర్ధన్ వర్ధంతి సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఇందులో పలువురు పాల్గొన్నారు.

కారు, బొలేరో వాహనాల ఢీ



ఎల్కతుర్తి: మండలంలోని కోతులనడుమ గ్రామ శివారులో గల జీల్గుల క్రాస్‌రోడ్డు వద్ద హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై సోమవారం కారు, బొలేరో వాహనం ఎదురెదుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా బొలేరో పల్టీకొట్టింది. ఈ రెండు వాహనాల్లో ఉన్న ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలు కాగా వారిని గ్రామస్తులు చికిత్స నిమిత్తం 108వాహనంలో ఎంజీఎంకు తరలించారు.

పంథినిలో కారు బోల్తా

ఐనవోలు: కారు బోల్తా పడిన సంఘటన మండలంలోని పంథిని గ్రామం వరంగల్-ఖమ్మం రహదారిపై చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వరంగల్ నుంచి గద్వాల్‌కు వయా తొర్రూర్ మీదుగా ఓ కుటుంబం కారులో ప్రయాణిస్తున్నారు. వరంగల్-ఖమ్మం రహదారి పంథిని గ్రామానికి కారు చేరుకోగా సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పింది. పార్కింగ్ చేసి ఉన్న బైక్‌ను ఢీకొట్టి కొంత దూరం తోసుకువెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో బైక్, కారు ధ్వంసం కాగా టీస్టాల్ దెబ్బతింది. ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి ప్రాణాపాయం తప్పి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై గుగులోతు వెంకన్నను వివరణ కోరగా ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదన్నారు. ధ్వంసమైన బైక్ పంథిని గ్రామానికి చెందిన బండి మహేందర్‌దిగా గుర్తించామన్నారు. పెద్దవంగరకు చెందిన జాటోతు సురేష్ కారు నడుపుతున్నట్లు తెలిసిందని, పూర్తి సమాచారం లేదన్నారు.

కేసు నమోదు

ధర్మసాగర్: మండల కేంద్రానికి చెందిన ఓ బాధితుడి ఫోన్ వాట్సాప్‌కు గుర్తు తెలియన వ్యక్తి మార్ఫింగ్ ఫొటోలు పంపి బెదిరించి తను చెప్పిన అకౌంట్‌కు డబ్బులు పంపాలని లేకపోతే ఈ ఫొటోలు అందరికి పంపుతానని బెదిరించాడు. దీనితో బాధితుడు అకౌంట్‌కు రూ. 4900 పంపించాడు. అయినప్పటికీ బాధితుడిని ఇంకా డబ్బులు పంపాలని వేధిస్తుండడంతో సోమవారం 1930 సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫిర్యాదు చేయడంతో ధర్మసాగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి



ఆత్మకూరు: వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



శాయంపేటలో..



కమలాపూర్‌లో..

ఆత్మకూరు: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు కేశవమూర్తి, మాధవ మూర్తి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

శాయంపేట: మండల కేంద్రంలోని శ్రీ భక్తమార్కండేయ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం భక్తులకు ఉత్తర ద్వారదర్శన ఏర్పాట్లను చేశారు. ఆలయ పురోహితులు తాటి రమేష్, రంగు యాదగిరి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ముక్కోటి ఏకాదశి పర్వదిన విశిష్టను తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్, అయ్యప్పస్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పరకాల: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పరకాల పట్టణంలోని శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానం, శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

దామెర: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా సోమవారం జరుపుకున్నారు. మండలంలోని పులుకుర్తిలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు అఖిలేష్ చార్యులు ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకాలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల యూత్ వింగ్ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ రాజు పాల్గొని పూజలు నిర్వహించారు.

ఐనవోలు: మండలంలోని కక్కిరాపల్లి గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు అర్చకుడు జయకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అర్చకుడు మాట్లాడుతూ ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో 30 రోజుల పాటు తిరుప్పావై ఆరాధన జరుగుతుందన్నారు. సోమవారం తిరుప్పావైలోని 18వ పాశురం పఠనం చేసినట్లు చెప్పారు. ఉత్తర ద్వారం గుండా స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను మహామండపంలో దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శిస్తే మోక్షం కలుగుతుందని తెలిపారు.

ఎల్కతుర్తి: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని సోమవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో భక్తులు బారులు తీరారు. స్థానిక శ్రీ వీరభద్రస్వామి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది.

కమలాపూర్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వారం గుండా ఆలయాల్లోకి ప్రవేశించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో వైష్ణవ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఈ ప్రత్యేక పూజల్లో ఆయా ఆలయాల అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మొక్కలను ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



ధ్వంసమయిన హరితహారం మొక్కలు

నడికూడ: మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హరితహారం మొక్కలను విరిచిపడేశారు. గ్రామస్తుల కథనం ప్రకారం హరితహారంలో భాగంగా కంఠాత్మకూర్ నుంచి హనుమకొండ ప్రధాన రహదారికి ఇరువైపుల అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటారు. ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులకు హరితహారం మొక్కలు విరిగిరోడ్డుపై పడి ఉండడం గమనించారు. అలాగే గ్రామంలో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నేమ్ బోర్డ్స్‌ను కూడా పల్లుచోట్ల ధ్వంసం చేశారు. ఈవిషయంపై పంచాయతీ కార్యదర్శి శ్రీభార్గవిని వివరణ కోరగా, దామెర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన మార్కెట్ కార్యదర్శి

పరకాల: వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని పరకాల వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

నూతనోత్తేజంతో పనిచేయాలి



భీమదేవరపల్లి: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ

భీమదేవరపల్లి: నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు నూతనోత్తేజంతో పనిచేయాలని ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఎంపీడీఓ భాస్కర్ అధ్యక్షతన సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు అధికారులు వారధిగా ఉండాలన్నారు. ఇందులో ఎంపీఓ నాగరాజు, పీఆర్ ఏఈ సంతోష్, ఏపీఓ కుమారస్వామి, ఈసీ శ్రీధర్ రావు, పంచాయతీ కార్యదర్శులు జంగం పూర్ణచందర్, వీరన్న, మధు తదితరులున్నారు.

శాయంపేట: శాయంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలను సోమవారం సర్పంచ్ కందగట్ల రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా సర్పంచ్ రవి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ రవి గ్రామ ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ వార్డు సభ్యులు జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మసాగర్: పీఆర్‌టీయూ టీఎస్ వేలేరు మండల శాఖ అధ్యక్షుడు వి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వై. తిరుపతి ఆధ్వర్యంలో వేలేరులోని జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం పీఆర్టీయూ టీఎస్ 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంఎన్ఓ బి మహేష్ నాయక్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వి శ్రీనివాస్, ఎంపీపీఎస్ హెచ్ఎం బి లీలాబాయి, సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సోమవారం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అబ్బు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ - టీఎస్ క్యాలెండర్‌ను మండల ఎంఈఓ రమాదేవి, ఆత్మకూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నిర్మలా కుమారిలు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి జి.భుజంగరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎడ్ల ఉపేందర్‌రెడ్డి, మార్త సురేందర్, జనార్ధన్‌రెడ్డి, పాశికంటి శ్రీనివాస్, ప్రభాకర్, వేమారెడ్డి, వెంకట్రాంరెడ్డి, భిక్షపతి, దాంజి, అపర్ణ, ఎంఆర్‌సీ బృందం సభ్యులు సంధ్యారాణి, తిరుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల రాస్తారోకో



భీమదేవరపల్లి: రాస్తారోకో చేస్తున్న నాయకులు



ఎల్కతుర్తిలో..

భీమదేవరపల్లి: సర్పంచ్‌లకు మద్దతుగా హైదరాబాద్‌కు వెళ్లకుండా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో పాటుగా కాంగ్రెస్ నాయకుల అరెస్ట్‌ను నిరసిస్తూ మండలంలోని ముల్కనూర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఊసకోయిల ప్రకాశ్ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ గ్రామాల్లో నిధులు లేమితో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపించారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇందులో నాయకులు పొన్నాల మురళి, తాళ్లపల్లి కిరణ్, షేక్ వలీ, ఒల్లాల రమేష్, గజ్జి వీరయ్య, ఆర్.వెంకటరెడ్డి, సదానందం, కొంరయ్య, రామచంద్రం తదితరులున్నారు.

ఎల్కతుర్తి: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించదలిచిన ధర్నాకు వెళ్లకుండా మండల కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆపార్టీ మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ పార్టీ నిర్వహించే పోరాటాన్ని ఆపలేరన్నారు. సాయంత్రం నాయకులను స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో మహేందర్‌తో పాటు గొడిశాల నరేష్, అంబాల రమేష్, కడారి హరీష్ తదితరులు ఉన్నారు.

శాయంపేట: రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయిస్తోందని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చింతల భాస్కర్, మారపల్లి కట్టయ్య, రాజు ప్రభుత్వాన్ని విమర్శించారు. గ్రామ పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లించడంపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. అయితే ఈ ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు.

దళితకాలనీ అభివృద్ధికి కృషిచేస్తా

● ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాలనీవాసులు

దామెర: మండల కేంద్రంలోని దళిత కాలనీలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని పరకాల ఎమ్మెల్యే చల్లాధర్మారెడ్డి అన్నారు. ఎస్సీ కాలనీకి చెందిన గ్రామస్తులు ఎమ్మెల్యేను సోమవారం తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని, శ్మశాన వాటికలో బోర్‌వేసి మినీ వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయాలన్నారు. సైడ్ డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. వెంటనే సమస్యలంటిని పరిష్కరిస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కలిసిన వారిలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోలం కృపాకర్ రెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి, గ్రామస్తులు దామెర రమేష్, కట్టయ్య, సదిరం లింగయ్య, శ్రీను, పింటూ, జల్సా రాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ

ఐనవోలు: మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యావారధి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసినట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు బీమళ్ల సారయ్య తెలిపారు. సారయ్య మాట్లాడుతూ విద్యావారధి స్వచ్ఛంద సేవా సంస్థ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గడే సుబ్బారావు కూతురు సాయి ప్రణతి పుట్టినరోజు సందర్భంగా పండ్లు పంపిణీ చేశామన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి విద్యావారధి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, టీచర్లు మధుకర్, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, సారయ్య, రాజు, చంద్రమోహన్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని రక్షించండి

శాయంపేట: భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వం భూమిని రక్షించి, చుట్టూ ట్రెంచ్ నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, జిల్లా నాయకుడు చుక్కయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం తహసీల్దార్ చలమల్ల రాజుకు సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 632/1, 633 భూమిని కొంతమంది వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని, అభూములను కబ్జా చేస్తున్నారని, ఆ భూములను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పేదలు అనేక మంది ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఆ భూమిని పేదలకు పంపిణీ చేసి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాలని కోరారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

● మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

పరకాల: కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామ పంచాయతీల కొత్త భవనాలకు శంకుస్థాపనలు చేస్తూ తానే స్వయంగా మంజూరు చేయించినట్లు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ ఆలేరు నియోజకవర్గ పాలక్, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పరకాల అభివృద్ధిపై చర్చకు సిద్దమా అని చల్లా ధర్మారెడ్డికి సవాలు విసిరారు. సోమవారం పరకాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మొలుగూరి బిక్షపతి, హుస్నాబాద్ నియోజకవర్గ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ మాట్లాడారు. సమైక్యవాద పార్టీ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఎనిమిది సంవత్సరాలుగా ఆస్తుల పెంచుకోవడం తప్పా పరకాల నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి కృషిచేయలేదన్నారు. ఎమ్మెల్యేలంతా కొత్త జిల్లాల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి సాధించుకోగా చల్లా ధర్మారెడ్డి మాత్రం నాడు శ్రీలంక పర్యటనలతో పరకాల అన్యాయానికి కారకుడయ్యారని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో వేసిన శంకుస్థాపనలకు పనులు పూర్తిచేయలేదంటూ మున్సిపల్ భవనం నిర్మాణాన్ని ఉదాహారణగా తెలిపారు. పరకాల ఆర్టీసీ డిపోకు 105 బస్సులు ఉండగా నేడు 50 బస్సులకు కుదించిన ఎమ్మెల్యే పట్టించుకోలేదన్నారు. మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల చివరకు ఒక్క పరిశ్రమను తీసుకరాలేకపోయారని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కాచం గురుప్రసాద్, దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మంద రాజు

భీమదేవరపల్లి: ఈ నెల 11న బెంగళూర్‌లో జరగనున్న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు అన్నారు. మండలంలోని ములకనూర్‌లో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మంద రాజు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జరిగే జాతీయ మహాసభలకు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఇందులో జిల్లా కోఆర్డినేటర్ బండారి సురేందర్, గంగారపు శ్రీనివాస్, రేణుకుంట్ల భిక్షపతి, మాట్ల వెంకటస్వామి, తాళ్లపల్లి మధూకర్, పార్నందుల మహేందర్, ఐలపాక స్వామి, పార్నందుల సురేష్ తదితరులు ఉన్నారు.

భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

ఆత్మకూరు: పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను, పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ధర్మల రామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మికులతో పాటు ఏఐటీయూసీ నాయకులు మండల విద్యాశాఖాధికారి రమాదేవికి వినతిపత్రం అందించారు. అనంతరం రామ్మూర్తి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నా.. భోజన కార్మికులకు సరైన వేతనాల బిల్లులు ప్రతినెల అందించడం లేదన్నారు. కార్మికులు అనేక వ్యయ ప్రయాసాలకు ఓర్చి విద్యార్థులకు వడ్డిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా 11 నెలల క్రితం రూ. 3 వేల గౌరవ వేతనాన్ని భోజన కార్మికులకు ప్రకటించారని, దానిని వెంటనే అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్లకు అందించే విధంగా భోజన కార్మికులకు కోడి గుడ్లను ప్రభుత్వమే అందించాలన్నారు. అలాగే విద్యార్థుల శాతాన్ని బట్టి వంటగ్యాస్ ఇవ్వాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులను వెంటనే అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అనే క్లాజులు లేకుండా అందరికీ సమానంగా ఒకేసారి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు వైనాల విజయ, మండల కార్యదర్శి అజ్మీతా బేగం, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు రాములు, చిలుకమ్మ, రజిత, ఈశ్వరమ్మ, సుందరమ్మ, సఫియా, రమ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ 2.50 లక్షల విరాళం



విరాళం ప్రకటిస్తున్న పూర్వ విద్యార్థులు

కమలాపూర్: కమలాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయానికి కమలాపూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998-99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.2.50 లక్షలు విరాళంగా అందజేస్తామని సోమవారం ప్రకటించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుటున్న టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణంలో భాగంగా 18 మెట్ల తాపడం పనులకు తమ వంతు సాయం చేస్తామంటూ వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రూ.2.50 లక్షలు విరాళంగా ప్రకటించారు. అదేవిధంగా మండలంలోని ఉప్పల్‌కు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాయినేని తిరుపతిరావు ఉప్పల్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ గర్భగుడి ఆలయ శిఖర పునర్నిర్మాణానికి, మరమ్మతులకు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఇందులో పలువురు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చైర్మన్, ఈఓ

భీమదేవరపల్లి: మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో జమ్మి, తులసీ మొక్కలను ఆలయ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ఈఓ కిషన్‌రావు సోమవారం మొక్కలు నాటారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ మొక్కలు నాటినట్లు వారు తెలిపారు. ఇందులో అర్చకులు కంచనపల్లి రాజయ్య, మొగిలిపాలెం రాంబాబు, తాటికొండ వీరభద్రయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టి సహకారం అవసరం

దామెర: అభివృద్ధి పనులకు సమష్టి సహకారం అవసరమని ఎంపీడీఓ ఎం. వెంకటేశ్వర్ రావు, తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్ అన్నారు. నూతనంగా నిర్మించబోయే గ్రామ పంచాయతీ భవనం స్థలం విషయమై సోమవారం అన్ని పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీ నాయకుల అభిప్రాయాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. అందరి అభిప్రాయాల మేరకు ప్రభుత్వ పాఠశాల ముందుగల స్థలంలో గ్రామపంచాయతీ భవనం నిర్మించాలని తీర్మానించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ జీపీ భవనం కోసం రూ 20 లక్షలు మంజూరు చేసినట్లు, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోలం కృపాకర్ రెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి, సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, నాయకులు దామెరుప్పుల శంకర్, హింగె బాబురావు, దామెర కట్టయ్య, మాదారపు రతన్‌కుమార్, వేల్పుల రాజ్‌కుమార్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.